క్లుప్తంగా

రూ.20 లక్షలతో యూజీడీ సమస్యల పరిష్కారం



కల్లుపాకలు ప్రాంతంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డులోని అన్ని వీధుల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తున్నామని కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు అన్నారు. సోమవారం ఆయన వార్డులోని కల్లుపాకలు, ప్రసాద్‌గార్డెన్స్, పండావీధి, వెలంపేట వీధుల్లో పర్యటించారు. సమస్యాత్మకంగా ఉన్న యూజీడీలను చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా సచివాలయాలకు వచ్చిన రూ.20 లక్షల నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. మిగతా వీధుల్లో ఉన్న యూజీడీల సమస్యలు కూడా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

సీతారాముల కల్యాణ మహోత్సవాలకు విరాళం



రూ.50వేల విరాళాన్ని సంఘం అధ్యక్షుడికి అందజేస్తున్న రోహిత్ అర్జీ

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 30వ వార్డులో విశ్వ శాంతిని కాంక్షిస్తూ శ్రీరామాంజనేయ షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న సీతారామ కల్యాణ మహోత్సవాలకు రోర్ ఆర్కిటెక్చర్ సంస్థ ఎండీ రోహిత్ ఆర్జీ సోమవారం రూ.50వేల విరాళం అందజేశారు. ఆర్కిటెక్ట్ రోహిత్ అర్జీ, ఆమె తల్లిదండ్రులు సూర్యప్రకాశరావు, కనకమహాలక్ష్మి, సోదరుడు షణ్ముఖ్‌సాయికి సంఘం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు తాడి రవితేజ, కార్యదర్శి కోన శంకర్, సంఘం సభ్యులు రామకృష్ణమ్మ, రత్నమ్మ, వేణు, అరుణ, భవాని, రవి పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

దాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారికి మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ స్వర్ణ పుష్పార్చనలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు.

ఏయూ ప్రగతిపై పూర్వ విద్యార్థుల హర్షం



వీసీ ఆచార్య ప్రసాదరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన పూర్వ విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల 1979–83 బ్యాచ్ విద్యార్థులు సోమవారం వర్సిటీని సందర్శించారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డితో సమావేశమయ్యారు. ఏయూను నూతన లక్ష్యాల దిశగా నడిపిస్తున్న విధానంపై హర్షం వ్యక్తం చేశారు. వర్తమాన తరం విద్యార్థులను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్న విధానం, విద్యార్థులను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే దిశగా తీసుకుంటున్న చర్యలను వీసీ ప్రసాదరెడ్డి వివరించారు. అనంతరం పూర్వ విద్యార్థుల సహకారంతో చేపట్టిన హాస్టల్ భవనం నిర్మాణాన్ని వారు పరిశీలించారు.

ప్రమాదకరంగా జంక్షన్

- రామకృష్ణ రైతుబజార్ వద్ద తరచూ ప్రమాదాలు
- స్పీడ్ బ్రేకర్లు, సీసీ కెమెరాల ఏర్పాటుకు వ్యాపారుల వినతి



రామకృష్ణ రైతుబజార్ జంక్షన్

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డులోని రామకృష్ణ రైతుబజారు జంక్షన్ ప్రమాదకరంగా ఉంది. జ్ఞానాపురం, పూర్ణామార్కెట్, పోర్టు, పాతనగరం వెళ్లేందుకు మూడు రహదారుల జంక్షన్ కావడంతో ఈ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ జంక్షన్‌లోనే రామకృష్ణ రైతుబజార్ కూడా ఉండడంతో వివిధ గ్రామాల నుంచి ఉదయాన్నే అయిదు గంటలకు వారు పండించిన పంటలతో రైతులు వందల సంఖ్యలో వస్తుంటారు. ఇంకా నగర శివార్ల నుంచి వెళ్లాలంటే పోలీసు అధికారులు, ట్రాఫిక్ నుంచి తప్పించుకునేందుకు వాహన చోదకులు ఈ మార్గం మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు.

తరచూ ప్రమాదాలే

రామకృష్ణ జంక్షన్ వద్ద తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటూనే ఉంటాయి. గతంలో ఈ మార్కెట్‌కు సంబంధించిన ఓ మహిళను బస్సు ఢీకొనడంతో ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. ఇటీవల మరో మహిళారైతు పండించిన కూరగాయలను అమ్మకానికి తీసుకువచ్చి, బస్సు దిగుతుండగా ప్రమాదానికి గురవడంతో ఆమె కాలు విరిగింది. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతూనే ఉన్నాయి.

కానరాని స్పీడ్ బ్రేకర్

రామకృష్ణ రైతుబజార్ వద్ద మూడు రోడ్డుల్లో ఎక్కడా ఒక్క స్పీడ్ బ్రేకర్ గానీ, సీసీ కెమెరా గానీ లేదు. దీంతో వాహనచోదకులు ఇష్టారాజ్యంగా వాహనాలు నడపడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వన్‌టౌన్ పరిధిలోని ఈ ప్రాంతం స్టేషన్‌కు దూరంగా ఉండడంతో అడిగే నాథుడు లేక, నిత్యం భయంభయంగా ఉంటున్నామని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు.

తీసుకోవలసిన చర్యలు

- రామకృష్ణ రైతుబజార్ వద్ద మూడు రహదారుల వద్ద స్పీడ్‌బ్రేకర్లు నిర్మించాలి.
- సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ కానిస్టేబుల్స్ విధులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలి.
- వాహనాలు పరిమిత వేగంతో వెళ్లేలా చూడాలి.
- రైతుబజార్‌కు వచ్చే వ్యాపారులు రహదారి పక్కనే వ్యాపారాలు చేపట్టకుండా దూరంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి.

ఎప్పుడేం జరుగుతుందో..



రామకృష్ణ రైతుబజార్ వద్దకు వచ్చే వినియోగదారులు, వ్యాపారులందరం రోజూ భయంతోనే ఉంటాం. ఏ రోజు ఎవరికి ఏం జరుగుతుందో తెలియడం లేదు. ప్రమాదాలు అరికట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– నాయిని సూర్యనారాయణ, రైతుబజార్ వ్యాపారి

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



గతంలో ఈ మార్కెట్ వద్ద పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అయితే, ఓ లారీ సీసీ కెమెరాలు ఉన్న స్తంభాన్ని ఢీకొనడంతో ఆ పోల్‌తో పాటు కెమెరా కూడా పాడైంది. అప్పటి నుంచి కెమెరాలు లేవు. సీసీ కెమెరాలు ఉంటే, ప్రమాదాల నివారణతో పాటు రైతుబజార్‌లో దొంగల భయం కూడా తగ్గుతుంది.

– వెంకటరమణ, రైతుబజార్ వ్యాపారి

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉపయోగిస్తే చర్యలు



తోపుడు బండి వద్ద పాలిథిన్ కవర్లు పరిశీలిస్తున్న జెడ్సీ శివప్రసాద్

జగదాంబ: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉపయోగిస్తే చర్యలు తప్పవని జీవీఎంసీ జోన్–4 జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ హెచ్చరించారు. జోన్ పరిధిలోని 12 వార్డుల్లో సోమవారం ఆయన పర్యటించారు. ప్లాస్టిక్ ఉపయోగిస్తున్న తోపుడుబండ్ల వ్యాపారులతో మాట్లాడారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధించామని, పాలిథిన్ కవర్లు వినియోగించవద్దని సూచించారు. హోల్‌సేల్ మార్కెట్‌పై దాడులు చేసి ప్లాస్టిక్ అమ్మకాలు నిషేధించామని, అయినా కవర్లు కనబడుతున్నాయన్నారు. దాడులను మరింత ఉధృతం చేసి, పూర్తిగా నిషేధిస్తామని చెప్పారు. ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే ఆ దుకాణదారులకు అపరాధ రుసుము విధించడంతో పాటు, దుకాణాల ట్రేడ్ లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. తోపుడు బండ్ల వ్యాపారులు, చిరు వ్యాపారులు ప్లాస్టిక్ ఉపయోగం పూర్తిగా నిషేధించాలన్నారు. పూర్ణామార్కెట్ వద్ద జీవీఎంసీ ఏర్పాటు చేసిన ప్లాస్టికేతర కవర్ల స్టాల్స్ వద్ద విక్రయిస్తున్న కవర్లు కొనుగోలు చేసుకోవాలని సూచించారు.

జోన్–4 పరిధిలో 9 ఆధార్ కేంద్రాల ఏర్పాటు



ఆధార్ సెంటర్‌ను పరిశీలిస్తున్న జెడ్సీ శివప్రసాద్

జగదాంబ: ప్రతీ ఒక్కరూ ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలని జీవీఎంసీ జోన్–4 జెడ్సీ శివప్రసాద్ సూచించారు. ఆయన సోమవారం ఆధార్ కేంద్రాన్ని పరిశీలించారు. జెడ్సీ మాట్లాడుతూ జోన్ పరిధిలో నేవల్ క్యాంటీన్, దండుబజార్, నెహ్రూ నగర్, కోడిపందేల వీధి, మట్ట వెంకటప్పవీధి, వెలంపేట, టౌన్‌కొత్తరోడ్డు, ద్వారాబజార్, నేరేళ్ల కోనేరు వద్ద సచివాలయంలో మొత్తం తొమ్మిది ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. వాటిలో డాక్యుమెంట్ అప్‌డేట్, ఆధార్ అప్‌డేట్, బాలల ఆధార్ నవీకరణ చేయించుకోవాలని సూచించారు. ఈ అవకాశం ఈ నెల 21 వరకు, 27 నుంచి 29 వరకు ఉంటుందని తెలిపారు. అప్‌డేట్ చేసుకోని వారంతా త్వరగా చేయించుకోవాలని కోరారు.

తల్లికి మూగ బాలిక అప్పగింత

అల్లిపురం: తప్పిపోయిన మూగబాలికను రక్షించి, పోలీసుల సహాయంతో తల్లి చెంతకు చేర్చారు నిరాశ్రయ వసతి గృహం సిబ్బంది. వివరాలివి.. ఒక మూగ బాలిక ఆదివారం అర్ధరాత్రి కంచరపాలెం రోడ్డుపై తిరుగుతుండగా, కంచరపాలెం పోలీసులు ఆమెను గుర్తించి, రక్షించారు. టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని జీవీఎంసీ ఏయూటీడీ నిరాశ్రయ మహిళా వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు. ఆమె పై న్యూపోర్టు పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు అయిందని తెలియటంతో టూటౌన్ పోలీసుల సహకారంతో బాలిక తల్లి సరస్వతిని సోమవారం షెల్టర్‌కు పిలిపించారు. న్యూపోర్ట్ పోలీసుల సమక్షంలో బాలికను తల్లికి అప్పగించినట్లు నిరాశ్రయ వసతి గృహం మేనేజర్ జ్యోతిర్మయి తెలిపారు.

ఘనంగా నూకాంబిక తొలేళ్ల ఉత్సవం



అమ్మవారి ఘటాలు ఊరేగిస్తున్న మహిళలు

అల్లిపురం: కొత్త అమావాస్య సందర్భంగా అల్లిపురం సమీప కొబ్బరితోటలోని శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయంలో, నేతాజీ నగర్‌లో గల నూకాంబిక అమ్మవారి ఆలయాల్లో ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కొత్త అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని తొలేళ్ల ఉత్సవంలో భక్తులు అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి ఘటాలు కొబ్బరితోట, నేతాజీనగర్, ఎస్‌వీపీ నగర్ ప్రాంతాల్లో డప్పువాయిద్యాలు, గరిడి, భజన కార్యక్రమాలతో వీధుల్లో తిరువీధి నిర్వహించారు. మంగళవారం ఉదయం అమ్మవారి ఉత్సవాలు, భక్తుల దర్శనాల నిమిత్తం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలియజేశారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వైభవంగా నూకమాంబ జాతర



రంగిరీజువీధిలో వెలసిన నూకమాంబ

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 36వ వార్డు రంగిరీజువీధిలో వెలసిన నూకమాంబ జాతర మహోత్సవాలు (కొత్త అమావాస్య ఉత్సవం) సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. సోమవారం తొలేళ్ల ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం 4 గంటలకు అమ్మవారికి పంచామృతాభిషేకాలు, మంగళస్నానం, విశేష పూజలు జరిపారు. పసుపు నీళ్ల కళశాలతో ఊరేగింపు రంగిరీజు వీధి, ఏవీఎన్ కాలేజ్ డౌన్‌రోడ్డు, మెయిన్ రోడ్డు మీదుగా సాగింది. మంగళవారం కొత్త అమావాస్య జాతర జరపనున్నారు. 22న ఉగాది వేడుకలు, అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్న సమారాధన నిర్వహించనున్నట్లు శ్రీనూకమాంబ సేవా సమాజం కమిటీ సభ్యులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



అల్లిపురం: గుర్తు తెలియని వ్యక్తి కేజీహెచ్‌లో మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలివి.. ఆర్టీసీ కాంప్లెక్స్ బస్ స్టాపు వద్ద గుర్తు తెలియని వ్యక్తి సోమవారం ఉదయం అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు 108 అంబులెన్స్‌లో కేజీహెచ్‌లో చేర్పించారు. అక్కడి డాక్టర్లు పరీక్షించి, అప్పటికే ఆ వ్యక్తి మృతి చెందినట్లు తెలిపారు. మృతి చెందిన వ్యక్తికి సుమారు 35 సంవత్సరాలు ఉంటాయని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు 94903 91090, 0891–278362 ఫోన్ నంబర్లలో తెలియజేయాలని కోరారు.

పంచాయతీ కార్మికుల ఆందోళన



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పంచాయతీ స్వచ్ఛ భారత్, కాంట్రాక్టు కార్మికులు

మహారాణిపేట : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఏపీ యునైటెడ్ గ్రామ పంచాయతీ శానిటరీ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ అనుబంధం) విశాఖ జిల్లా ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట గ్రామ పంచాయతీ స్వచ్ఛ భారత్, కాంట్రాక్టు కార్మికులు ఆందోళన చేశారు. పంచాయతీల్లో పారిశుధ్యం పనులు చేస్తున్న స్వచ్ఛ భారత్ కార్మికుల వేతనాలు పెంచాలని కోరారు. ఆరు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ మల్లికార్జునకు అందజేశారు.

ఎర్నిమాంబ హుండీ ఆదాయం లెక్కింపు



డబ్బులు లెక్కిస్తున్న సిబ్బంది

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలో గల ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో సోమవారం దేవాదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకులు హుండీల లెక్కింపు నిర్వహించారు. 25 రోజులకు అమ్మవారి దర్శనాలకు సంబంధించిన హుండీల ఆదాయం రూ.9,02,595లు, 91 గ్రాముల బంగారం, 7 కేజీల 380 గ్రాముల వెండి వచ్చినట్లు దేవాదాయశాఖ ఆలయ కార్యనిర్వహణాధికారి సురేష్ బాబా తెలిపారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్.ప్రసన్నలక్ష్మి పర్యవేక్షణలో ఆదాయం లెక్కించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గవర రమణ, కె.ఉమమహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కోసం నిధుల మంజూరుకు వినతి



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

మహారాణిపేట: చదువుకున్న మహిళలకు ఉపాధి కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం దళిత మహిళా శక్తి సంఘం ఆధ్వర్యంలో పలువురు మహిళలు నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు జి.మరియమ్మ, జిల్లా సహాయ కార్యదర్శి బాలయోగి, తదితరులు పాల్గొన్నారు.

జీవో నం–1 రద్దుకు డిమాండ్

జీవో నంబర్ 1ను తక్షణం రద్దు చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) జిల్లా సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ వై.రాంబాబు, నాయకులు ఎస్.నారాయణ, ఆర్.పవన్, యు.నాగరాజు, దేవ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'జీవితాన్ని ఉన్నతంగా మలచుకోవాలి'

ఏయూ క్యాంపస్: జీవితాన్ని ఉన్నతంగా మలచుకోవాలని క్రీడా పరిశోధకుడు, కమ్యూనిటీ సైకాలజిస్ట్ సుంకర నాగేంద్ర కిషోర్ అన్నారు. సోమవారం ఏయూ ఎంబీఏ విభాగంలో నిర్వహించిన కార్యక్రమంలో 'మాస్టర్ యువర్ లైఫ్'అనే అంశంపై ఆయన మాట్లాడారు. యువత ప్రధానంగా తమలోని అంతర్గత శక్తిని, సామర్థ్యాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. నిత్య వ్యాయామం, పుస్తక పఠనం, తగినంత నిద్ర, మంచి ఆహారపు అలవాట్లను కలిగి ఉండాలని సూచించారు. విభాగాధిపతి ఆచార్య జాలాది రవి మాట్లాడుతూ ఆశావాద దృక్పథంతో యువత నడవాలన్నారు. తద్వారా ఉజ్వల భవితను సొంతం చేసుకోవడం సాధ్యపడుతుందన్నారు. విశ్రాంత ఆచార్యులు డాక్టర్ శ్రీజ్యోతి సేవలను గుర్తు చేసుకుని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.సుబ్బయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం హమాలీల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న హమాలీలు

మహారాణిపేట : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సివిల్ సప్లయిస్ హమాలీలు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఏపీ స్టేట్ సివిల్ సప్లయిస్ హమీలీస్ యూనియన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో పీఎఫ్, పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. పలు సమస్యలపై కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. యూనియన్ నాయకులు ఎం.మన్మథరావు, పైల అప్పారావు, ఎం.వెంకటరమణ, సన్యాసినాయుడు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీల ర్యాలీ



జగదాంబ జంక్షన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, నాయకులు

దాబాగార్డెన్స్: వేతనాలు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ ఇవ్వాలని, ఫేష్ యాప్ రద్దు చేయాలంటూ చలో విజయవాడ కార్యక్రమానికి అంగన్‌వాడీలు పిలుపునిస్తే, వారిని ఎక్కడికెక్కడ అరెస్టులు చేసి పోలీసులు నిర్బంధించడాన్ని సిటూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ ఖండించారు. ఈ మేరకు పోలీసుల అక్రమ అరెస్టులు ఖండిస్తూ జగదాంబ జంక్షన్ నుంచి లేపాక్షి వరకు, అక్కడి నుంచి సిటూ కార్యాలయం వరకు సోమవారం ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలను నిర్బంధించడం, అరెస్టులు చేయడం అన్యాయమన్నారు. రాజ్యాంగం ఇచ్చిన నిరసన తెలియజేసే హక్కును కాలరాస్తున్నారని మండిపడ్డారు. న్యాయమైన సమస్యలు పరిష్కరించే వరకు పోరాడుతామన్నారు. జగన్, అప్పలరాజు, కుమార్‌మంగళం, ఎం.సుబ్బారావు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు సుజాత, శ్రీదేవి, రమ, నూకాలమ్మ, శ్రావణి, సంతోష్‌కుమార్, భవాని పాల్గొన్నారు.

రేపటి నుంచి సీతారామ కల్యాణోత్సవాలు



కరపత్రం ఆవిష్కరిస్తున్న సంపంగి శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు

సీతంపేట: వైఎస్సార్‌సీపీ నాయకుడు, సింహాచలం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు, మంగమ్మ దంపతుల ఆధ్వర్యంలో స్థానిక పార్వతీశ్వరాలయంలో ఈ నెల 22వ తేదీ ఉగాది రోజు నుంచి 30 వరకు సీతారామ కల్యాణ వసంత నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన కరపత్రాలను సోమవారం పార్వతీశ్వరాలయంలో శ్రీనివాసరావు ఆవిష్కరించి మాట్లాడారు.

శ్రీరామనవమి సందర్భంగా 2018 నుంచి ప్రతి ఏటా కల్యాణ మహోత్సవాలు జరుపుతున్నామని, ఈ ఏడాది కూడా అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 22న పెండ్లి రాట, ఉత్సవ విగ్రహాలకు మంగళ స్నానం, కలశ స్థాపన చేస్తామన్నారు. ఈ నెల 30వ తేదీ శ్రీరామనవమి రోజున ఉదయం 9 గంటల నుంచి పార్వతీశ్వరాలయం వద్ద కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరుగుతుందని చెప్పారు. సాయంత్రం మేళతాళాలతో ఉత్సవమూర్తులను ఊరేగిస్తామని తెలిపారు. 31వ తేదీ ఉదయం 8 గంటలకు స్వామి వారికి పట్టాభిషేకం అత్యంత వైభవంగా జరిపిస్తామన్నారు.

ప్రజాహితుడు సి.ఎస్.రావు



సి.ఎస్.రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్, సాహితీవేత్తలు

సీతంపేట: నిస్వార్థంగా సమాజ సేవకు అంకితమయ్యే అరుదైన వ్యక్తుల్లో సి.ఎస్.రావు అగ్రగణ్యుడని గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ అన్నారు. ఇటీవల కన్నుమూసిన ప్రజాహృదయ నేత, ప్రజాస్పందన వ్యవస్థాపకుడు సి.ఎస్.రావు సంస్మరణ సభ గాంధీ సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ విలువలు, సచ్ఛీలత, నిజాయితీ, సమయపాలన, విజ్ఞానం, వినమ్రత అన్నీ కలబోసిన వ్యక్తి సి.ఎస్.రావు అని కొనియాడారు. ఆయన లోని లోటు పూడ్చలేనిదని పేర్కొన్నారు. మనందరం ఆయన ఆశయ సిద్ధికి కృషి చేయాలని కోరారు. సహృదయ సాహితి సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజాహితం కోసం సి.ఎస్.రావు ఎన్నో ఉద్యమాలు చేశారన్నారు. పదవీ విరమణ అనంతరం విశాఖ వచ్చి సమాజ సేవ చేయడం మనందరి అదృష్టమన్నారు. సాహితీవేత్త డి.వి.సూర్యారావు మాట్లాడుతూ సి.ఎస్.రావు నుంచి క్రమశిక్షణ, కార్యదీక్ష, సామాజిక స్పృహ, కర్తవ్యపాలన నేటితరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నండూరి రామకృష్ణ, కె.వి.ఎస్.మూర్తి, డాక్టర్ జి.రఘురామారావు, ఎస్.విజయ్‌కుమార్, కూటికుప్పల సూర్యారావు, వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి, సి.ఎస్.రావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పాస్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

తగరపువలస: పీడబ్ల్యూఏ ఓల్డ్ భీమునిపట్నం పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 2023 – 24 సంవత్సరానికి నూతన కార్యవర్గం ఎన్నికయింది. అడ్వయిజరీ బోర్డులో ఉన్న పాస్టర్లు పి.ఎస్.శ్యామ్‌బాబు, తిమోతీ బాబీ, సువర్ణరాజు, ఇషాక్ ఆధ్వర్యంలో వెల్లంకి మై హోప్ చర్చిలో సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా డి.విక్టర్ డేవిడ్, కార్యదర్శిగా స్టీవెన్ రాజు, కోశాధికారిగా జి.జాన్, వైస్ ప్రెసిడెంట్‌గా వినీత్ బోయాజ్, సహాయ కార్యదర్శిగా కె.తిమోతీ, సహాయ కోశాధకారిగా సీహెచ్.తిమోతీ నియమితులయ్యారు.